నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

- నకిలీ మద్యంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ఎందుకు మాట్లాడటం లేదు
- స్వయంగా ఎమ్మెల్యే అభ్యర్థి తన రైట్ హ్యాండ్‌తో కలిసి ఆఫ్రికా ఫార్ములాతో నకిలీ మద్యం తయారీ యూనిట్
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- నకిలీ మద్యంపై ప్రత్తిపాడులో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ
- ఎక్సైజ్ సీఐ అశోక్‌కు వినతిపత్రం అందజేత



ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషను ఎదుట మద్యం పారబోసి నిప్పుపెడుతున్న మహిళలు

ప్రత్తిపాడు: నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు కదంతొక్కాయి. నాణ్యమైన మద్యం అంటే నకిలీ మద్యమా.. ప్రజల ప్రాణాలతో చెలగాటమా.. అంటూ జోరు వానలోనూ నిరసన గళం వినిపించారు. నకిలీ మద్యంపై సోమవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక పాతమల్లాయపాలెం కూడలిలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి బస్టాండు మీదుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషను వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎక్సైజ్ స్టేషను ఎదుట మహిళలు మద్యం సీసాల్లోని మద్యాన్ని పారబోసి నిప్పుపెట్టారు. అనంతరం ఎక్సైజ్ సీఐ అశోక్‌కు బలసాని కిరణ్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు షేక్ రసూల్, మండల పార్టీ అధ్యక్షులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

నకిలీ మద్యం కుంభకోణం తేటతెల్లం..

బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నకిలీ మద్యం విషయంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంపై నిందలు మోపేందుకు ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కానీ నేడు నకిలీ మద్యం కుంభకోణం తేటతెల్లమైందన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తన స్నేహితుడితో నకిలీ తయారీ యూనిట్ పెట్టి ఆఫ్రికా ఫార్ములాతో నకిలీ మద్యం తయారు చేసి విక్రయించారని పేర్కొన్నారు. కుంభకోణంలో చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లకు డబ్బులు ముడుతున్నాయా అన్న విషయం తెలియాలన్నారు. తురకపాలెం ఘటనలో అక్కడి వాళ్లు మద్యం తాగి చనిపోయారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చెప్పారని, ఇది తెలిసి చెప్పారా లేక తెలియక చెప్పారా అని ప్రశ్నించారు. ఒకవేళ తెలిసి చెబితే కల్తీ మద్యం వలన చనిపోయి ఉంటే వారందరికీ న్యాయం చేయాలన్నారు. నకిలీ మద్యం తయారీ దారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు చల్లా హనుమంత్‌యాదవ్, ఖాశింపీరా, నల్లమోతు శివరామకృష్ణ, స్టేట్ జాయింట్ సెక్రటరీ మెట్టు వెంకటప్పారెడ్డి, ఆయా అనుబంధ విభాగాల అధ్యక్షులు ఓం ప్రకాష్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, సుధాకర్, సన్నీ, బాపతు వెంకటరమణ, పార్టీ నాయకులు గంగిరెడ్డి పరమారెడ్డి, బి. వెంకటేశ్వరరెడ్డి, జి. శివారెడ్డి, బోరుగడ్డ రజిని, పిల్లి మేరి, ముత్యాలరాజు, బైరెడ్డి రవీంద్రరెడ్డి, గండు నాగరాజు, మెర్సిరాణి, సీహెచ్ లక్ష్మణ, కె.వెంకట్రావు, కవిత, వాడపల్లి ఫ్రాన్సిస్, ఎం.మహేంద్ర పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టి, ప్రజల ప్రాణాలు కాపాడాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త
అంబటి మురళీకృష్ణ



ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: కూటమి పాలనలో మారింది బ్రాండ్లు కాదని.. మద్యాన్నే మార్చి కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విక్రయిస్తున్న నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పట్టణంలోని ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ బ్రాండ్ల పేరుతో మాయచేస్తూ బెల్టు దుకాణాల ద్వారా నకిలీ మద్యాన్ని విక్రయిస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది పేదలు ప్రాణాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. ఇటీవల బయటపడిన నకిలీ మద్యం తయారీ.. సరఫరా చూస్తుంటే ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. యథేచ్ఛగా సాగుతున్న ఈ దందా మూలాలు రాష్ట్రంలో పలుచోట్ల కనిపిస్తున్నాయని చెప్పారు. కేవలం స్పిరిట్, రసాయనాలతో తయారు చేసిన నకిలీ మద్యాన్ని పాపులర్ బ్రాండ్లను తలపించేలా బాటిళ్లపై నకిలీ లేబుల్స్ అంటించి సరఫరా చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా మొలకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో భారీ స్థాయిలో నకిలీ మద్యం, స్పిరిట్, వేల సంఖ్యలో మద్యం బాటిళ్లు, మూతలు, మద్యం తయారీ యంత్రాలు ఎక్సైజ్ శాఖ తనిఖీల్లోనే బయటపడటం విశేషమన్నారు.

పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం మద్యం విధానాలు రద్దు చేసి, వైన్ షాపులు పెంచడమే కాకుండా, అన్నిచోట్ల బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేసిందని మురళీకృష్ణ విమర్శించారు. నకిలీ మద్యంతో ఒక్క ఏడాదిలోనే రూ.5,280 కోట్లు టీడీపీ ముఠా దోచుకుందని ఆరోపించారు. వెంటనే నకిలీ మద్యాన్ని కట్టడిచేయాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. మద్యం షాపులను మళ్లీ ప్రభుత్వమే నిర్వహించేలా చొరవ చూపాలని అన్నారు. బడి, గుడి సమీపంలో ఏర్పాటు చేసిన వైన్ షాపులు, బార్ల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఎక్సైజ్ సీఐ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు తాడిబోయిన వేణుగోపాల్, అధికార ప్రతినిధి ఎండేటి వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, పెన్షనర్స్, ఎంప్లాయీస్ విభాగం అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షులు రుద్రపాటి నాగేశ్వరరావు, వైద్య విభాగం అధ్యక్షులు మోహనరావు, వట్టిప్రోలు రంగారావు, ఆర్. ఆదిశేషు, రమేష్, అంబటి వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, మూర్తిరాజు, మాము, దేవరకొండ గోపి, వివిధ అనుబంధ విభాగాల అధక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోలర్ స్కేటింగ్‌లో సెయింట్ జోసెఫ్ విద్యార్థుల ప్రతిభ



పెదకాకాని: సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు రోలర్ స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటారు. మండల కేంద్రమైన పెదకాకాని సెయింట్ జోసెఫ్ సీబీఎస్‌సీ పాఠశాల విద్యార్థులు గుంటూరు జిల్లా అమరావతి రూరల్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో నిర్వహించిన రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో బి.శ్యాం ప్రవీణ్(8 తరగతి), కుర్ర చరణ్జిత్(7 తరగతి), రోనివర్ధన్(4 తరగతి) వివిధ విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సంధ్యారాణి పోటీలలో గెలుపొందిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

క్రీడాకారులకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి అభినందన



గుంటూరు రూరల్: బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన మండలంలోని అంకిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్ విద్యార్థిని దొడ్డా నేత్ర, తొమ్మిదో తరగతి విద్యార్థి చల్లా ఆకాశ్‌లను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అభినందించారు. నగరంలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో అంకిరెడ్డి పాలెంలో నిర్మించిన బాస్కెట్ బాల్ శిక్షణ కేంద్రంలో దాదాపు 80 మంది పైగా క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ శిక్షణ ఇచ్చే అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి రామచంద్రరావు, ఫిజికల్ డైరెక్టర్ నాగిరెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు వీర గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

పొన్నూరు: పట్టణంలోని 21 వార్డు ముబారక్‌నగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నయీమ్ బాషా అనారోగ్యంతో గుంటూరులో వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదేశాల మేరకు సోమవారం పార్టీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు, మాము పాల్గొన్నారు.

క్యాష్ కొడితే చాలు.. ఖాళీ స్థలాలు శుభ్రం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా వర్షపు నీటితో నిండిపోయి అధ్వానంగా మారాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదులు రావడంతో ఖాళీ స్థలాలు శుభ్రం చేయించుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నారు. కాని కొంత మంది సిబ్బంది డబ్బులకు కక్కుర్తి పడి నగరపాలక సంస్థకు చెందిన వెహికల్స్ ద్వారా ఖాళీ స్థలాల్లోని వర్షం నీటిని తొలగిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇలాంటి వారి దందా అధికమైందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పెదకాకానిలో డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెదకాకాని: రైతులు కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకానిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవంలో డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నన్నపనేని మాట్లాడుతూ యజమాని సంతకంతో పని లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. దేవాలయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలన్నారు, అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తింపజేయాలన్నారు. ఉపాధి హామీ పనులను సంవత్సరంలో 200 రోజులు కల్పించి రోజువారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సంకూరి నీలాంబరం, కోటిపల్లి సత్యనారాయణ, కె శివప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ బాక్సు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: నిడుబ్రోలు రైల్వేస్టేషన్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ బాక్సు అమర్చారు. కొంచెం పట్టించుకోరూ.. శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన ఖనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ప్రమాదాలను నియంత్రణకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిన అధికారులు, సిబ్బంది పనితీరుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


ఫ్యూజ్ బాక్సు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఎరువులపై రాజకీయం


రైతు సేవ కేంద్రంలో కూర్చుని వసూలు చేసిన యూరియా డబ్బును లెక్కిస్తున్న ప్రైవేట్ వ్యక్తి

గుంటూరు: ఎరువుల పంపిణీ రాజకీయ రంగు పులుముకుంటుంది. కొందరు సచివాలయ ఉద్యోగులు కూటమి నాయకుల కనుసన్నల్లో పని చేస్తూ వారు చెప్పినట్లుగా తా అంటే తందానా అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో స్థానికంగా సమస్యలు తలెత్తుతున్నాయి. వట్టిచెరుకూరు మండలం కోవెలమూడిలోని రైతు సేవ కేంద్రానికి మూడు రోజుల కిందట యూరియా స్టాక్ వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు సదరు రైతు సేవ కేంద్రం గోడౌన్ వద్దకు వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రాధాన్య క్రమంలో ముందుగా వచ్చిన రైతులకు వచ్చినట్లు ఇవ్వకుండా, టీడీపీ నాయకులు చెప్పిన వాళ్లకు ఎరువుల స్లిప్పులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. అంతేకాకుండా వచ్చిన రైతులను బయటనే నిలబెట్టి కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆర్ఎస్‌కే గోడౌన్ లోపలకు వెళ్లి షట్టర్లు దించుకున్నారు. కొంత సేపటికి వారికి అనుకూలమైన వారికే యూరియా స్లిప్పులు ఇచ్చి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారు. అనంతరం వసూలు చేసిన డబ్బును హార్టికల్చర్ అసిస్టెంట్‌కు అప్పజెప్పారు. కాగా అందరికీ ఒకేలా ఎరువులను పంపిణీ చేయకుండా వివక్ష చూపారు. ఇదే విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు వీహెచ్‌ఏను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సోమవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. వీహెచ్‌ఏ ఎరువుల పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏకపక్షంగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సరిపడినన్ని ఎరువులు ఇవ్వాలని కోరారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పొన్నూరు: ప్రజల నుంచి వివిధ సమస్యలపై తీసుకునే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించారు. వాటిలో రెవెన్యూ 4, మున్సిపాలిటీ 1, పంచాయతీరాజ్ 1, పోలీసు 1, సర్వేకు సంబంధించి తీసుకున్న 1 అర్జీని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి



గుంటూరు రూరల్: నగరంలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఆహ్లాదాన్ని అందించే మొక్కలను నాటాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం జేకేసీ కాలేజ్ రోడ్, సమ్మర్‌పేట, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఈ సీజన్‌లో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా వార్డుల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. నగరపాలక సంస్థ ఉద్యానవన అధికారులు ప్రధాన రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో మొక్కలను విరివిగా నాటాలన్నారు. ఇప్పటికే డివైడర్లలో ఉన్న మొక్కలను సంరక్షించడానికి శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. పొత్తూరు చెరువుకట్ట సమీపంలో మురిపి సింగమ్మ(55) అనే వృద్ధురాలు జీవిస్తుండేది. ఆమె భర్త శ్రీనివాసరావు గతంలో మృతి చెందటంతో సింగమ్మ ఒంటరిగానే ఉంటుంది. అదే గ్రామంలో తన కుమార్తె అల్లుడు ఉండేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సింగమ్మ ఇంట్లో ఒంటరిగా మంచం పక్కనే పడి ఉండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రెండు రోజుల క్రితం సింగమ్మ ఇంట్లో ఒక యువకుడు చోరీకి పాల్పడగా సింగమ్మ చూసి వాళ్ల అమ్మకు చెప్పటంతో వివాదం జరిగిందని, ఈ క్రమంలో చోరీకి పాల్పడిన యువకుడే అతడి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వృద్ధురాలిని హతమార్చి ఉండవచ్చని గ్రామంలో ప్రజల్లో చర్చాంశనీయంగా మారింది. ఇది హత్య, లేక ఆకస్మిక మరణమా అనేది పోస్ట్ మార్టం రిపోర్ట్‌లో తేలనుందని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం


కోటి సంతకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త
అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 17 వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనే కూటమి ప్రభుత్వ ఆలోచన ఎంత మాత్రం సరి కాదని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణ పరిధి ఇటికంపాడు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆ విధానాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజా ఉద్యమం తీవ్రతరం అవుతోందని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలకు మంచి జరుగుతోందని అన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతిఒక్కరినీ అధిష్టానం గుర్తించి తగిన సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు తాడిబోయిన వేణుగోపాల్, అధికార ప్రతినిధి ఎండేటి వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, పెన్షనర్స్, ఎంప్లాయీస్ విభాగం అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, వైఎస్సార్‌టీయూసీ విభాగం అధ్యక్షులు రుద్రపాటి నాగేశ్వరరావు, వైద్య విభాగం అధ్యక్షులు మోహనరావు, వట్టిప్రోలు రంగారావు, ఆర్.ఆదిశేషు, రమేష్, అంబటి వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, మూర్తిరాజు, మాము, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

సంక్షేమానికి తాళం..!


తాళాలు వేసి ఉన్న ప్రత్తిపాడులోని ఎస్సీ బాలికల వసతిగృహం.. మెయిన్ గేట్‌కు వేసిన తాళం(ఇన్‌సెట్‌లో)

ప్రత్తిపాడులోని ఎస్సీ బాలికల వసతిగృహం సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సోమవారం ఉదయం 10.50 గంటల సమయంలో హాస్టల్‌కు మెయిన్ గేట్‌తో పాటు గ్రిల్స్‌కు తాళాలు వేసి సిబ్బంది ఎవ్వరూ లేకుండా ఎంచక్కా ఇళ్లకు వెళ్లిపోయారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇలా తాళాలు వేసి వెళ్లిపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇదే విషయమై హాస్టల్ వార్డెన్ శోభారాణిని సాక్షి ప్రశ్నించగా విధుల్లో ఉన్న ఉద్యోగి వంట చేసుకోవడానికి ఇంటికి వెళ్లిందని చెప్పడం గమనార్హం.

– ప్రత్తిపాడు

పల్లెల్లో గాడి తప్పిన పాలన

- పారిశుద్ధ్యం అధ్వానం
- తాగునీటి సరఫరా అస్తవ్యస్తం
- పట్టించుకోని పాలకులు


వెనిగండ్లలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షంనీరు


ముస్లింపాలెంలోని ఎయిర్‌వాల్‌లో నానుతున్న పాతచెప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు


కాలువల నుండి తీసిన మురుగు కుప్పల నుండి గడ్డి మొలకెత్తుతున్నా తొలగించని దృశ్యం

పెదకాకాని: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పల్లె పాలన గడితప్పింది. సమస్యలు వెంటాడుతున్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగునీటి పారుదల లేక అవస్థలు పడుతున్నారు. ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. వివరాలు... పెదకాకాని మండలంలోని వెనిగండ్లలో కొంతకాలంగా పారిశుద్ధ్యం పడకేంది. మురుగుకాలువల్లో పూడిక తీయడం లేదు. గ్రామంలోని ఎస్సీకాలనీలో ఇంటి చుట్టూ వర్షపునీరు చేరి రోగాల బారిన పడుతున్నా, సమస్యను ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పరిష్కరించడం లేదు. అలానే చెంచుల నివసించే ఇళ్లల్లోకి వర్షంనీరు చేరినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వారు గుడిసెలు ఖాళీ చేయాల్సి వచ్చింది. ఎస్టీ కాలనీలో మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో స్థానికులు ఆ వర్షంనీటిలోనే నడుస్తున్నారు. పూడికతీత సిల్ట్ తరలించడం లేదు. బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్ పేరుతో లక్షల రూపాయలు బిల్లులు పెట్టే అధికారులు వర్షాకాలంలోనూ గుప్పెడు సున్నం చల్లడం లేదు. ఎడతెరపి లేకుండా కురుస్తున్నా వర్షాలతో రోడ్డు బురదగా మారిన, కాలువల్లో మురుగు పేరుకు పోయి దోమలు ఉధృతమవుతున్నా నివారణ చర్యలు శూన్యం.

మురుగునీటితో ఎయిర్‌వాల్స్..

గ్రామంలో రక్షిత తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా అవుతుంది. నీటిని గ్రామంలోకి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఎయిర్‌వాల్స్, వాల్స్ వద్ద ఏర్పాటు చేసిన గోతుల్లోకి వర్షంనీరు, మురుగునీరు చేరుతుంది. ఆ నీటిలో చెత్త చెదారం, చెప్పులు పడి నానుతున్నాయి. ఇప్పటికే గ్రామంలో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా చేస్తున్నారు. తాగునీటి చెరువులకు సంపూర్ణంగా నీరు నింపడానికి అవకాశం ఉన్న పట్టించుకోవడం లేదు.

రేపు శివాలయంలో హుండీ కానుకలు లెక్కింపు

పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 15వ తేదీన హుండీలు తెరచి కానుకలు లెక్కించడం జరుగుతుందని ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవదాయశాఖ ఆదేశాల మేరకు అధికారుల పర్యవేక్షణలో బుధవారం కానుకలు లెక్కించడం జరుగుతుందన్నారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు ఆలయ కళ్యాణ మండపంలో జరిగే లెక్కింపు కార్యక్రమంలో భక్తులు పాల్గొన వచ్చని డీసీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.